


# (జీ) వనగానం

పాలడుగు వెంకటేశ్వరరావు

చల్లని ఎల్లని తెమ్మెరలు మెల్లగా కదిలి పోతున్నయ్ వృక్షతతులతో ఎచ్చాపాటి చెబుతూనే ఆకాశంలో నవ్వుతూ పయనిస్తూ వున్న చందమామ వెండి వెలుగుల్లో కొండలూ కోనలూ వాగులూ వంకలూ తరులూ లతలూ లతాంతాలూ స్నానాలు చేస్తూ మౌనగీతాలు ఆలపించటంలో లీనమయి వున్నయ్ పరవశించి పోతూ వున్నయ్ అనుభూతి పరంపరల్లో

ఎత్తుగా ఎదిగి ఆకాశాన్ని ముద్దు పెట్టుకోవటాన్కి ఆరాటపడుతున్న మదగజంలాటి ఆశైల శిఖరాగ్రాన ఒక చిన్న బొరియ వుంది ఆ కన్నం దగ్గర కాపు వేసి ఏకాగ్ర చిత్తంతో చూపులు నిగిడ్చి మెడ రిక్కించి చాలా సేపట్నుంచీ వేచివుంది ఒక తొండ ఆ కలుగులో - మట్టిని తొలుస్తూ గుజ గుజ లాడుతూ వేషాలు వేస్తూవున్న ఒక మట్టి పురుగుకి ఆ సంగతి తెలియదు

ఒక చిన్న మబ్బు తునక ఎట్నుంచో గాలికి కొట్టుకుని వచ్చి చంద్రుడ్ని కప్పివేయగా- ఆ ప్రదేశాన నీడలు అలముకున్నయ్ ఆ నీడల తెరలు కలుగు లోపలికీ చొరబడ్డాయ్ ఏమిటీ విచిత్రం! - అనుకుంటూ బొక్కలో నుండి బయటికి వచ్చి బొరవిరుచుకుని నిలబడి ఆకాశంలోకి తేరిపార చూడబోయింది- పురుగు

చందమామకి అడ్డు తొలగింది ఆ నల్ల మబ్బు తునక ప్రక్కకి జరిగి పోయింది వెన్నెల వాన తిరిగి కురవసాగింది పచ్చ వెలుగు ఆ ప్రదేశాన్ని ప్రకాశవంతం చేసింది మళ్ళీ

అకస్మాత్తుగా దౌర్జన్యం తొంగి చూసింది ఆ నీరవ నిశీది సమయాన ప్రశాంతతని స్వల్పంగా భంగపరుస్తూ కండ బట్టిన మట్టి పురుగు కాళ్ళు గిజగిజ లాడాయ్

అవకాశం కోసం ఎదురు చూస్తూవున్న తొండ చడీ చప్పుడూ లేకుండా లాఘవంగా లంఘించి పురుగుని పట్టుకుని- గిజగిజ లాడుతూవున్న ఆ పురుగు అసలు ఏం జరుగుతూవుందో గ్రహించేలోగానే- నోట్లో వేసుకుని చప్పరించింది తృప్తిగా తోకని ఎగరేసింది హాయిగా దవడ ఆడించి తలని పైకి క్రిందికి వూగించింది

ఆ తొండకి అల్లంత దూరంలో పొదమాటున పొంచివున్న అడవి ఎల్లి ఎర్రటి గోళాల్లాంటి కళ్ళతో- జరుగుతూ వున్న సంగతిని నిశితంగా పరికిస్తూ వుండింది ఆ క్షణాన దాని బుర్రలో మెరుపు మెరిసింది వెంటనే అది ఆ తొండ మీదికి లంఘించింది గిలగిలలాడుతున్న ఆ తొండ- క్షణాలలోనే అడివి పిల్లికి ఆహార మయింది ఆ క్షణాన

దూరాన్న కొండ లోయల్నుంచి దట్టమైన అడవి వృక్షతతుల నుంచి భయంకరమయిన చప్పుళ్ళు వినవచ్చాయ్ ఆ దిక్కుగా చెవులు రిక్కించి కళ్ళు నిగిడించి చూపులు సారించింది అడవి ఎల్లి కాస్సేపట్లోనే ఆ చప్పుళ్ళును కొండలు మ్రింగి వేయగా- నీరవ నిశ్శబ్దం ఆ ప్రాంతంలో రాజ్యం చేసింది మరలా

అమాయకంగా వెన్నెల్లో ఆడుకుంటూ గడ్డిపరకలు గిరుకుంటూ వున్న చూడి లేడిని నాలుగు రేచులు చుట్టుముట్టాయి క్షణాలలోనే గడ్డిపరకలు రక్తసిక్తమయ్యాయ్ గిలగిలలాడి నిర్జీవి అయిన లేడి రక్తంతో రేచుల మూతులు ఎర్రగా అయినయ్ విందులు గుడిచి

అదంతా చిత్రంగా అన్పించి - తగుదునమ్మా అంటూ ఆ మధ్యకి దూకి ఒక కండని అందిపుచ్చుకో బోయింది వుషారుగా అడివి ఎల్లి కోపంతో బుసలు కొడుతూ వున్న ఒక కుర్రరేచు- ఆటకాయి తనంగా ఆ ఎల్లి మీదకి లంఘించి బలంగా దాని మెడమీద కొరుకు కొరికి రక్తం పీల్చింది

మివ్ మివ్ అని గిలగిలలాడుతూ విగతజీవి అయింది అడివి ఎల్లి రక్తం రుచి నరనరాల్లో ఉత్సాహాన్ని రేకెత్తించగా- తోకలు ఎత్తి మోరలు సాచి- శవాల చుట్టూ అడుగులు వేస్తూ నృత్యం చెయ్యసాగాయి రేచులు

ఆ ప్రక్కనే -

ఎత్తుగా ఎదిగిన చెట్టు కొమ్మ నాశ్రయించి ఆకుల గుబురుల్లో దాగి ఇదంతా గమనిస్తూ వున్నాడు ఒక సిపాయి అతని వడిలో గన్ వుంది అతని యూనిఫాం చిరిగి పేలికలుగా అయివుంది అతని కళ్ళు లోతుకు పోయి వున్నాయి అతనిక ఆహారం అంది నాలుగు దినాలయింది అతని గొంతు దాహంతో ఎండి పోయి వుంది అతని వద్ద గన్ తప్ప మరేమి లేదు

నిశితమయిన దృక్కులతో అతను ఆ ప్రదేశాన్ని గాలిస్తున్నాడు అతను ఆరడుగుల పొడగరి ఆజానుబాహువు ఆహారం లేకపోవటం వలన అతని మొహం ఎక్కి పోయి వుంది నిద్ర లేకపోవటం వలన అతని కళ్ళు ఎర్రగా జ్యోతుల్లాగా వెలుగుతున్నాయ్ అతని కడుపు వెన్నుపూసకు అతుక్కుపోయి వుంది అతని చంపలు లోపలికి తొసుకు పోయి వున్నాయ్

నాలుగు రోజుల క్రిందటే - ఒక నిశిరాత్రి అక్కడికి ఒక పర్లాంగు దూరంలో - కొండ అంచున- భయంకర పోరాటం జరిగింది శత్రువు దాటికి అతని పటాలంలో చాలా మంది చనిపోగా- మిగిలిన కొందరు పారిపోగా- చాలాసేపు ఒంటిచేతో




పోరాడి- తను శత్రు సేనల మధ్యన వున్నానని గ్రహించినవాడయి- అదృష్టవశాత్తూ శత్రు సైనికుల బారి నుండి ఎలాగో తప్పించుకుని- అతను ఆ చెట్టు కొమ్మల మీద ఆకుల సందుల్లో దాగుకున్నాడు ప్రమాదాన్నుంచి తప్పించుకున్నాడు

అతనెవరో గ్రహించి నట్లున్నారు శత్రు సైనికులు! అతన్ని పట్టుకొనటాన్కి విశ్వ ప్రయత్నం చేశారు ఈ నాలుగు రోజులూ- ఆ శత్రు సైనికులు ఆ

## (జీ)వనగానం

ప్రాంతమంతటా- పట్టుదలతో- అడుగడుగూ గాలించటం అతనూ గమనించాడు ఆ సాయింత్రం చీకటపడేవరకూ సైనికుల పాద పుట్టనలు ఆ ప్రాంతాన్ని దద్దరిల్ల జేస్తూనే వున్నయ్! వారి మాటలు అతనికి వినిపిస్తూనే వున్నయ్

చీకట పడిన తర్వాత- సాయం సంధ్యా సమయాన

విచిత్ర మయిన విధంగా-సైనికుల చలనం దూరమయింది ఆ ప్రాంతాన్ని నిరవ నిశ్శబ్దం ఆవరించింది క్రమ్ముకుని వచ్చిన చీకట్లని ఆ తర్వాత బలంగా వ్యాపించిన వెండి వెన్నెల వెలుగులు పారద్రోలాయ్

అడపాదడపా తుపాకుల ప్రేలుళ్ళ మోతలక దూరాన్నున్న కొండలోయలు ప్రతిధ్వనిస్తూ- తిరిగి ప్రశాంతతకి ఆహ్వానం పలుకుతూ-క్రూర మృగ గర్జనల పుట్టనల క్కూడా అవకాశం కల్పిస్తూ ఒక విచిత్ర పరిస్థితిని వెల్లడి చేస్తుండగా- అప్పుడు-

రక్తం రుచికి -ఉత్సాహం పురకలు వేసి శివ మెత్తి గంతులు వేస్తూ కరాళ నృత్యంలో మునిగి వున్న ఆ రేచుల్ని-వాటి చెయిదాల్ని గమనించి కసిగా అప్రయత్నంగానే అతని చెయి గన్ మిదకి పోయింది వాస్తవ పరిస్థితి విస్మరింపబడి

డాం! డాం!డాం దిక్కులు దద్దరిల్లేటట్లుగా అతని చేతిలోన వుండిన ఆ గన్ పేలింది ఏ ఒక్క తూటా కూడా గురి తప్పలేదు

రేచులు కోరలు వెళ్ళబెట్ట నేల కొరిగాయ్

మరు నిముషాన-

అతని వెనుక నుంచి తుపాకులు ప్రేలాయ్! అడవి అదిరిపోయి గిజగిజ లాడింది దెబ్బ తగిలిన ఎట్టలాగా - అతను నేల మీద పడి పోయి గిలగిల లాడాడు దబదబమని సైనికుల బూట్లచప్పుళ్ళు అతన్ని సమీపించాయ్

ఫ్లాష్ లైట్లు వెలిగాయ్! ఆరిపోతూ మళ్ళీ వెలుగుతూ గాలింపు కొనసాగించాయ్ అతన్ని చుట్టుముట్టిన సైనికులు అతన్ని గుర్తించారు మరుక్షణం!

ఆ సాయంత్రమే -శత్రు సైనికుల్ని ఆ ప్రాంతాన్నించి పారద్రోలి- తప్పిపోయిన తమ కాప్టెన్ కోసం గాలిస్తున్న సైనికులు -అకస్మాత్తుగా వినవచ్చిన అతని తుపాకి ప్రేలుడుక - కంగారుపడి అతన్ని శత్రుసైనికుని గా భ్రమించి -అతని పైన కాల్పులు జరిపారు! ఆ కాల్పులకి చెట్టు మించి ఎట్టలాగ రాలి పడిన కాప్టెన్ బుజానికి తూటాలు తగిలాయ్ ఎర్రగా రక్తం స్రవించింది అతను గిలగిలలాడాడు- అంతకుముందు ఆ ప్రదేశంలోనే-అదే అవస్థలో గిలగిలలాడిన మట్టిపురుగులాగా తొండలాగా అడివి పిల్లిలాగా లేడిలాగా రేచుకుక్కల్లాగా-గాయపడి అవసాన దశలో వున్న ప్రతీ ఒక్క జీవిలాగా తమ కాప్టెన్‌ని సైనికులు బుజాల మీద మోసుకుంటూ-- దబ్బు దబ్బుమని అడుగులు వేస్తూ తమ స్థావరాన్కి తీసుకుపోగా- మరు నిముషాన- వన జీవన పునరుజ్జీవన సూచకంగా- అంత వరకూ అక్కడ జరిగిన బీభత్సానికి గజగజలాడిన ఆ బేల వనజాలాన్ని ఓదార్చటానికా అన్నట్లుగా చల్లని ఎల్ల తెమ్మెరలూ చందమామ సుతారపు వెండి వెలుగులూ ప్రశాంత నీరవ నిశ్శబ్దమూ ఆ ప్రాంతానికి తరలి వచ్చాయ్ □